నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 1
మంగళవారం 28 మార్చి 2023

పోషకాహారంపై గర్భిణీలకు అవగాహన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో పోషకాహార మహోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమము లో సూపర్ వైజర్ లత గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించారు దీనిలో భాగంగా ఆకుకూరలు, పాలు, గుడ్లు, ఇతర కూరగాయలు, పండ్లు, తినాలని ఆమె తెలిపారు. పౌష్టికాహారంతో తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు అంజలి, దేవకర్ణ, జయంతి, స్కూల్ సార్ సంగ్య, కిషోర్ బాలికలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

- బాలిక పరిస్థితి విషమం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఐస్‌క్రీం కొనిస్తానని చెప్పి బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ దారుణ ఘటన మండల కేంద్రంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఐస్ క్రీం కొనిస్తానని చెప్పి బాలికను (10) 23 సంవత్సరాల యువకుడు బైక్ పై తీసుకెళ్లాడు. లైంగికదాడికి పాల్పడటంతో బాలిక పరిస్థితి విషమంగా ఉంది. జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. కాగా ఈ విషయంలో రాజీకి యత్నాలు సాగుతున్నట్లు వినికిడి. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

లౌకిక విలువలు కాపాడుకుంటేనే..

ప్రజాస్వామ్య హక్కులు పొందగలం

- హైదరాబాద్‌లో రేపు జనచైతన్య యాత్ర ముగింపు సభ
- పెద్దఎత్తున తరలివచ్చి వివజయవంతం చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

బీజేపీ ప్రభుత్వం మోడీకి అత్యంత ఆప్తుడైన అదానికి లక్షల కోట్లు ప్రజాధనాన్ని దోచిపెడుతూ మతాల పేరుతో కులాల పేరుతో భాషల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుంది. ఎందరో అమరవీరుల ప్రాణాలు అర్పించి సాధించిన స్వాతంత్రాన్ని, లౌకిక విలువలను కాపాడుకోవడానికి అందరూ ఐక్యంగా కలిసి రావాలని, అప్పుడే ప్రజాస్వామ్య హక్కులు కాపాడబడతాయని' సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. అందుకోసం దేశవ్యాప్త ప్రచారాన్ని సీపీఐ(ఎం) నిర్వహిస్తుందని దాంట్లో భాగంగా రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి చేపట్టిన జన చైతన్య యాత్ర ముగింపు సభ ఈ నెల 29న (బుధవారం) హైదరాబాద్‌లో జరగనుందని కావున పార్టీ కార్యకర్తలు, నాయకులు, కార్మికులు, కర్షకులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మూడు కేంద్రాలుగా ప్రారంభమైన జన చైతన్య యాత్ర తెలంగాణలో పార్టీ కార్యకర్తలు వామపక్ష శ్రేయోభిలాషులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లో ప్రారంభమైన మూడు జాతాలు 29న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ముగింపు సభను జరిపి ప్రచార యాత్రను ముగించనున్నట్లు తెలిపారు. ముగింపు సభకు పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్ హాజరుకానున్నారని తెలిపారు.

మోడీ అమిత్ షాల నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై భారాలు మోపుతున్నారని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలతో పాటు నిత్యవసర సరుకుల ధరలు మూడు రెట్లు పెరిగి ప్రజల బాధలకు కారణమవుతున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపిని ఓడించటానికి ప్రజలందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట రాములు, నూర్జహాన్, పి.సూరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని శాస్త్రినగర్‌లో గల సీపీఐ(ఎం) కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడారు. రేపు హైదరాబాద్‌లో జన చైతన్య యాత్ర ముగింపు సభకు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, మేధావులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఏరియా కమిటీ సభ్యులు ఎల్లయ్య, తోకట్టి భూమేశ్వర్, భామండ్ల రవి, సిద్ధల నాగరాజు, కొల్లి శర్మ, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.



డీఎస్ ట్విస్ట్

కాంగ్రెస్‌కు రాజీనామా.. ఆరోగ్య సమస్యలతో నిర్ణయం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీలో చేరిన డీఎస్ ఒక్క రోజులోనే ఊహించని ట్విస్టు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తునట్టు ప్రకటించారు. ఈ మేరకు ఆయన సొమవారం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జునఖర్గేకు లేఖ రాశారు. తన కుమారుడు సంజయ్ కాంగ్రెస్‌లో చేరారని, సంజయ్‌తో పాటు తానూ వెళ్లినట్టు పేర్కొన్నారు. అయితే తనకు కండువా కప్పి పార్టీలో చేరుతున్నట్టు ప్రచారం చేశారని ఆ లేఖలో పేర్కొన్నారు. వయసురీత్యా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్టు తెలిపారు. డీఎస్‌కు ఆరోగ్యం సహకరించడం లేదని తన కుమారుడు ధర్మపురి అరవింద్ సైతం ఓ వీడియో ప్రకటనలో తెలిపారు.

కాగా నిజామాబాద్ ఎంపీ డీఎస్ చిన్నకుమారుడు అరవింద్ ఒత్తిడి వల్లే కాంగ్రెస్ పార్టీకి డీఎస్ రాజీనామా ప్రకటన వచ్చినట్టు ఆయన పెద్ద కుమారుడు సంజయ్ ఆరోపించారు. ఈ మేరకు కొన్ని టీవీ ఛానల్‌తో ఆయన ఈ విషయంపై ప్రత్యేకంగా మాట్లాడారు. డీఎస్ కు ప్రాణాహాని ఉందని సంచలమైన కామెంట్ చేశారు.

డీఎస్ కాంగ్రెస్‌లో చేరి క్రియాశీల రాజకీయాలకు దగ్గరవుతున్న తరుణంలో కొడుకుల మధ్య ఆయన నలిగిపోతున్నారు. చిన్న కుమారుడు బీజేపీ నుంచి ఎంపీగా ఉండడంతో ఒత్తిడి చేస్తున్నట్టు తెలుస్తుంది.

కాగా ఈ విషయమై స్పందించిన అరవింద్.. తన తండ్రి రాజీనామాలో తన ప్రమేయం ఏమీ లేదని, తనకు సంబంధం లేదని అన్నారు. తన తండ్రిని బీజేపీలో చేర్చడం లేదని, డీఎస్ ఎప్పుడూ కాంగ్రెస్ వాది అని తెలిపారు.

ప్రజావాణికి 56 ఫిర్యాదులు

తక్షణమే పరిష్కరించాలి : కలెక్టర్



ప్రజావాణీలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా 56 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, డిఆర్డిఓ సాయన్న, అధికారులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రూ.12.70 లక్షలు

తైబజార్‌కు మూడుమార్లు వేలం



వేలం పాట నిర్వహిస్తున్న జీపీ కార్యదర్శి

నవతెలంగాణ-పిట్లం

పిట్లం మండల కేంద్ర తైబజార్ వేలం ఎట్టకేలకు రూ.12.70 లక్షలు పలికింది. వాయిదాల అనంతరం ముచ్చటగా మూడోసారి వేలం పాట నిర్వహించడంతో నలుగురు పోటీ పడగా.. చివరకు భారీ ధర పలికింది. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం సర్పంచ్ విజయ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం తైబజార్ వేలం పాట నిర్వహించారు.

2023-24 ఆర్థిక సంవత్సరమునకు గాను నిర్వహించిన తై బజార్ వేలం పాటకు గాను 11 మంది రెండు లక్షల రూపాయలు చొప్పున ధరవత్తు సొమ్ము చెల్లించిన కాంట్రాక్టర్లు పాల్గొని వేలం పాట పాడారు. మార్చి 21న వేలం నిర్వహించగా.. 9.20 లక్షల ధర రావడంతో ప్రభుత్వం నిర్దేశించిన ధర రాలేదని వేలం పాటను వాయిదా వేశారు. తాజాగా సోమవారం చేపట్టగా.. ఉత్కంఠగా సాగిన వేలం పాట చివరికి రెండవసారి వాయిదా పడింది. శ్రీరామనవమి పండుగ సందర్భంగా వేరే రోజు నిర్ణయించలేమని పంచాయతీ సిబ్బంది తెలిపి మూడవసారి వేలం పాటను మధ్యాహ్నం 3 గంటలకు నిర్ణయించి వేలంపాట కొనసాగించారు. వేలం పాట రసవత్తరంగా సాగగా చివరి క్షణాలలో మండల కేంద్రానికి చెందిన ప్రణయ్, ఆయ్యుబ్, హైమద్, ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రానికి చెందిన రామాగౌడ్‌ల మధ్య చతుర్ముఖ పోటీ నెలకొంది. రామాగౌడ్ 12 లక్షల 69 వేల రూపాయల పాటపై మండల కేంద్రానికి చెందిన ఆయ్యుబ్ 12 లక్షల 70 వేల రూపాయలతో తై బజార్ వేలం పాటను దక్కించుకున్నారు. కాగా గతేడాది రూ.12.51 లక్షలకు వేలం పాట పలకగా.. ఈసారి రూ.19 వేలు తగ్గింది. కార్యక్రమంలో ఎంపీవో బ్రహ్మం, జీపీ కార్యదర్శి యాదగిరి, ఉప సర్పంచ్ ఇబ్రహీం, మాజీ వైస్ ఎంపీపీ నర్సాగౌడ్, వార్డు మెంబర్ గూలని ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రభుత్వ భూముల అన్యిక్రాంతం పై చర్యలు తీసుకోవాలని బాహుజన జాగృతి అధ్యక్షులు బండారి రాములు అన్నారు. సోమవారం కలెక్టర్ కు వినతి పత్రం అందజేసి ఆయన మాట్లాడుతూ మాక్లూర్ మండలంలోని మామిడిపల్లిలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతంపై ఉన్నతాధికారులతో జాయింట్ సర్వే చేయించి, మిగులి ఉన్న భూమిని పేద, భూమి లేని యస్.సి. కుటుంబాలకు మూడు ఎకరాలు చొప్పున పట్టా బుక్కుల తో మంజూరు చేయాలని కోరారు. రెవెన్యూ, ఫారెస్ట్‌తో జాయింట్ సర్వే నిర్వహించి ఆ శాఖలకు సంబంధించిన భూములను ఎవరు ఆక్రమించుకున్నారో తేల్చాలని అన్నారు.

కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-తాడ్వాయి



ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

దొరల, ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంచాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. తాడ్వాయి తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట్‌గౌడ్, రైతు సంఘం సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్ మాట్లాడారు. తాడ్వాయి మండలంలో దొరల భూములు ప్రభుత్వ భూములు వందలాది ఎకరాలు ఉన్నాయని అలాంటి భూములు అబ్దుల్ నగర్ ప్రాంతంలో 1200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఈ భూమిని నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో భూమిని ఆక్రమి స్తామని హెచ్చరించారు. అబ్దుల్ నగర్ శివారులో ఉన్న భూములను రీ సర్వే చేసి ప్రభుత్వ భూములను బయటకు తీయాలని లేకపోతే ప్రజలతో కలిసి తామే ఆ భూములను బయటకు తీస్తామని స్పష్టం చేశారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కంపెనీలు ప్రభుత్వ భూములను, అసైన్డ్ భూములను పట్టాలుగా మార్చి రిజిస్ట్రేషన్ చేసుకున్నా రని ఇలాంటి భూముని స్వాధీనం చేసుకొని నిరుపేదలకు మూడెకరాల భూమి పంచాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాయక్ రూప్ సింగ్, ఎస్ శంకర్ గణేష్, సాయిబాబా, రవి, జైరాం మోతిరాం, మోహన్, రాజు, సంగవ్వ, సత్యవతి, లక్ష్మి, అంబిక, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు ఇప్పించాలి

- బ్యాంక్ అధికారులను నిర్బంధించి తాళం వేసిన బాధితులు
- వర్నిలో కెనరా బ్యాంక్ ఎదుట బైటాయింపు



బ్యాంకుకు తాళం వేసి బ్యాంక్ ఎదుట బైటాయించిన బాధితులు

నవతెలంగాణ-వర్ని

కెనరా బ్యాంక్‌లో పిడి అకౌంట్ ఖాతాదారుల డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలోని బ్యాంక్ ఎదుట సోమవారం ఖాతాదారులు ఆందోళన చేపట్టారు. బ్యాంకుకు తాళం వేసి బైటాయించారు. సుమారు 45 మంది పిడి ఖాతాదారుల డబ్బులను బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సునీల్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ సుమా ప్రసన్న, పీడీ ఏజెంటు శ్రీనివాసులు కలిసి కాజేశారని ఆందోళనకారులు ఆరోపించారు. బ్యాంక్ అధికారులు కాజేసిన సుమారు 40 లక్షల రూపాయలను వెంటనే ఖాతాదారులకు చెల్లించాలని బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. బ్యాంక్ అధికారులు విచారణ పేరిట గత రెండు నెలలుగా కాలయాపన చేస్తూ బాధితులకు డబ్బులు చెల్లించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు మెయిన్‌లో..

మా భూమి మాకు ఇప్పించండి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బాధిత కుటుంబాల రిలే దీక్ష



రిలేదీక్షలో నినాదాలు చేస్తున్న నాయకులు, బాధిత రైతులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

తమ భూమిని సర్వే చేపట్టి తమకు అప్పగించాలని బాధితులు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నసురుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రవీందర్ దీక్షలు ప్రారంభించి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ నెమ్లి శివారులోని సర్వే నంబర్ 62లో 2 ఎకరాల, 20 గుంటల సాగుభూమి ఉన్నట్టు తెలిపారు. 20 ఏండ్ల క్రితమే భూమిపై వ్యవసాయ రుణాలు పొందమని, మా భూములకు పట్టాలు ఉన్నాయని అన్నారు. ఈ భూములపై నూతన పట్టాలు సైతం వచ్చాయని, రతుబంధు పొందుతు న్నట్టు కూడా తెలిపారు. కాగా కొన్నేండ్ల క్రితం ఉపాధి నిమిత్తం పట్టణానికి వలస వెళ్లినట్టు తెలిపారు. అయితే తమ భూమి ఆనవాళ్ల మారిపో యాయని, సర్వే చేపట్టి ఇవ్వాలని దరఖాస్తు చేసుకొని మూడేండ్లుగా తిరుగు తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మా గోడు ఆలకించి, పరిశీలించి, తమకు న్యాం చేయాలని రైతులు కోరారు. న్యాయం జరగకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. ఈ కార్యక్రమంలో కల్లాల గంగారం, దత్తు, సీపీఐ(ఎం) గ్రామ కార్యదర్శి నర్సింలు, జంపన్న సాయిలు, గంగామణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ జవాన్ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-తాడ్వాయి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ, గ్రామస్తులు

తాడ్వాయి మండలం చిట్యాల గ్రామంలో సిఆర్‌పిఎఫ్ జవాన్ కంది సిద్ధిరాములు విగ్రహాన్ని ఎస్పి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీర జవాన్ అయినటువంటి సిద్ధిరాములు విధి నిర్వహణలో తన ప్రాణాలు కోల్పోయాడన్నారు. దేశ రక్షణ కోసం పాటుపడిన మహనీయుడు సిద్ధిరాములు అని తెలిపారు జవాన్ తల్లి కంది నాగమణి విగ్రహ ఏర్పాటుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అన్యోన్య ,ఎల్లారెడ్డి సిఐ, తాడ్వాయి ఎస్సై ఆంజనేయులు, భువనేశ్వర్ జవాన్ భార్య బాలమణి, కుమారులు రాజేష్, ప్రణయ్, ప్రభస్ ,తమ్ముడు విఠల్ తదితరులు పాల్గొన్నారు

సృజనాత్మకతకు 'ఇస్రో' పురస్కారం

- ప్రభుత్వ ఉపాధ్యాయుడిని సన్మానించిన కలెక్టర్, డీఈవో

నవతెలంగాణ-కామారెడ్డి



ఉపాధ్యాయుడు రామకృష్ణను సన్మానిస్తున్న కలెక్టర్, డీఈవో, అధికారులు

తెలంగాణ నుండి సౌత్ ఇండియా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో వారిచే జాతీయస్థాయి ప్రతిభా పురస్కారం పొందిన జిల్లాకు చెందిన చిన్న మల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు విజయగిరి రామకృష్ణకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, డీఎస్ఓ సిద్దిరాం రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో సన్మానం చేశారు.

వివరాల్లో కెళ్తే 2022 సంవత్సర డిసెంబర్ చివరి వారం కామారెడ్డి జిల్లాలో జరిగిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో వీరి "డోంట్ మూవ్ సే- మై హైట్ " అనే త్రికోణమితీయ గణితాంశంలో జిల్లా నుంచి రామకృష్ణ ఎగ్జిబిట్ ఏకైక ఉపాధ్యాయ ఉత్తమ ప్రదర్శనగా రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక పర్యావరణ మరియు ఇన్స్పైర్ మాన్ ప్రదర్శన 2023 నిర్మల్‌లో జరిగింది. దీనిలో కూడా ఉపాధ్యాయుడు తన ఉత్తమ ప్రదర్శనతో అక్కడి జడ్జిమెంట్ టీం మన్ననలు పొందారు. తెలంగాణ నుంచి కేరళలోని త్రిశూర్ లో జరిగిన సౌత్ ఇండియా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు అత్యుత్తమ ప్రదర్శనలో పాల్గొనుటకు ఎంపికయ్యారు. ప్రదర్శనలో త్రికోణమితీయ భావనలు నిజ జీవిత సమస్యలకు ఎలా అన్వయించి సాధించవచ్చో నిరూపించి చూపించారు.

మన పూర్వీకులు పెద్దగా గణిత పరికరాలు కూడా లేని ఆ రోజుల్లో ఏ విధంగా చిన్న కర్రను ఉపయోగించి ఎత్తులను ఎలా కనుగొనేవారు. అద్భుత నిర్మాణాలను ఎలా చేపట్టారు. మొదలగు విషయాలు సరూప త్రిభుజాలకు అన్వయించి తక్కువ ఖర్చుతో టీఎల్ఎం ఉపయోగించి తన సృజనాత్మకతను జోడించి వివరించారు. వీటితో పాటు వీరు సులభమైన బోధన ద్వారా జామితీయ భావనలు, కా.సా.గు.-గా.సా.భ. , వృత్తాలకు సంబంధించి వివిధ గణిత అంశాలు, క్లిష్ట సిద్ధాంతాలను ఎంత సులభంగా విద్యార్థులకు అవగాహన కల్పించవచ్చునో వర్కింగ్ మోడల్ ద్వారా నిరూపించి చూపారు. ఆయన తయారు చేసిన వర్కింగ్ మోడల్ గల ఎగ్జిబిట్స్ ప్రదర్శనను మెచ్చుకొని ఈ ప్రత్యేక అవార్డుని ఇచ్చారు. కేరళలోని ఎడ్యుకేషన్ మినిస్టర్, జిల్లా కలెక్టర్ మరియు ఎమ్మెల్యేలు తెలంగాణ ఎస్ సి ఈ ఆర్ టి సభ్యులు సురేష్ బాబు , రమేష్ రావు చేతుల మీదుగా ప్రత్యేక పురస్కారాన్ని పొందారు.

అదేవిధంగా తన ప్రతిభావంతమైన ప్రదర్శన ,మౌలిక ప్రశ్నావళి సెమినార్ ద్వారా "భారత అంతరిక్ష పరిశోధన సంస్థ" వారి మన్ననలను పొంది ప్రత్యేక ఇస్రో పురస్కారం ధ్రువపత్రంతోపాటు సన్మానాన్ని పొందారు.



రామకృష్ణకు పురస్కారం అందజేస్తున్న కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణితంలో ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు చేస్తూ గణితం అంటే విద్యార్థులకు భయం పోగొట్టే విధంగా సృజనాత్మకతను జోడించి టిఎల్ఎం ద్వారా ఎంత గమ్మత్తుగా గణిత పరిజ్ఞానాన్ని అందించవచ్చునో ఈ ప్రదర్శన తెలిపిందని అన్నారు. ఇటువంటి ప్రదర్శనలతో భవిష్యత్తులో గణితంలో నూతన పద్ధతులలో విద్యార్థులకు ఎప్పటికప్పుడు మెరుగైన శిక్షణ ఇస్తూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని అన్నారు.

నిఖత్ జరీన్‌కు అభినందనలు తెలిపిన బాజిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రపంచ మహిళల బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి తెలంగాణ సత్తా చాటిన నిఖత్ జరీన్‌ను టీఎస్ ఆర్‌టీసీ చైర్మెన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అభినందనలు తెలియజేశారు. నిజామాబాద్ బిడ్డ నిఖత్ సాధిస్తున్న వరుస విజయాలు యావత్ దేశానికి గర్వ కారణ అని ఎమ్మెల్యే హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. నిజామాబాద్ కీర్తి ప్రతిష్టలు, తెలంగాణ రాష్ట్ర గౌరవాన్ని చిరస్థాయిలో నిలిచిపోయేలా తన ప్రతిభను కనబరుస్తున్న నిఖత్ జరీన్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో మరింతగా విస్తరింపజేయాలని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆకాంక్షించారు.

విద్యార్థినులకు అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయుర్వేద వైద్య నిపుణురాలు డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ ఈ రోజుల్లో విద్యార్థినిలు చిన్నచిన్న మానసిక ఒత్తిళ్లను తట్టుకోలేక తమ జీవితాలను బలి తీసుకుంటున్నారని అన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి ఆయుష్ విభాగం అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

- రాంపూర్ మహాజన సభలో ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి/భీంగల్

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించిన విధంగానే లక్ష రూపాయల లోపు రుణమాఫీని ఏకకాలంలో విడుదల చేయాలని, లావనీ పట్ట ఉన్న రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని, వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన హమాలీ డబ్బులు వెంటనే రైతులకు ఇవ్వాలని మహాజన సభలో ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. డిచ్ పల్లి మండలంలోని రాంపూర్ డి సహకార సోసైటిలో మహాజన సభ సహకార సొసైటీ చైర్మన్ తారాచంద్ నాయక్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సహకార సొసైటీలో అవినీతి లేకుండా పారదర్శకంగా సొసైటీని జిల్లాలో మొదటి స్థానంలో వచ్చే విధంగా పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే సొసైటీ ఆధ్వర్యంలో రాంపూర్, తిర్మన్‌పల్లి గ్రామాల్లో దుకాణాల సముదాయాల నిర్మాణం చేయడం జరిగిందని, ఔత్సాహికులు ఉంటే అద్దెకు ఇస్తామని వివరించారు. అనంతరం సహకార సొసైటీ సీఈవో నాగరాజ్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలల కాలంలో వచ్చిన లావ దేవిల వివరాలను మహాజన సభ దృష్టికి తీసుకుని



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ తారాచంద్‌నాయక్

వచ్చి ఆమోదం పొందారని తెలిపారు. వచ్చే నేల నుండి వరి ధాన్యం కొనుగోలు చేపడతామని రైతులందరూ సహకరించి కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకొని వచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని చైర్మన్ తారాచంద్ నాయక్ సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ స్వామి, డైరెక్టర్లు రాజ్ కుమార్, బొక్క గంగాధర్, మేకల రమేష్, నర్సయ్య, గంగారాం,శ్రీను,సాయన్న, సర్పంచ్లు పాపాయి తిరుపతి, నర్సయ్య, మల్లాపూర్ ఉప సర్పంచ్ రఘునథన్ రాము, నాగేశ్వరరావు, బసప్రభు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

భీంగల్:రైతు సేవా సహకార సంఘాల ద్వార రైతులకు విస్తృత సేవలు అందుతాయని భీంగల్ సొసైటీ చైర్మన్ శివసారి నర్సయ్య అన్నారు. సోమవారం పట్టణకేంద్రంలోని ఎఫ్ఎస్‌సిఎస్‌లో 58వ మహాజన సభ నిర్వహించారు. ఈసందర్భంగా గడిచిన ఆరు మాసాలలో సొసైటీలోని లావదేవీలను కార్యదర్శి అశోక్‌గౌడ్ చదివి వినిపించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏయంసీ చైర్మన్ గుణ్‌వీర్‌రెడ్డి, మరియు డైరెక్టర్లు , రైతులు పాల్గొన్నారు.

నలంద పాఠశాలలో ఐఐటి పరీక్షల నిర్వహణ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లిలోగల నలంద ఐఐటి స్కూల్‌లో - ఈ అబ్యాస్ ఐఐటి ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 3వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు గ్రాండ్ ఒలంపియాడ్ పరీక్షను సోమవారం నిర్వహించారు. ఇందులో మూడవ తరగతి నుండి 5వ తరగతి వరకు గ్లోబల్ ఒలంపియాడ్, ఆరవ తరగతి నుండి 9వ తరగతి వరక. మెగా ఒలంపియాడ్ ఐఐటి పరీక్ష సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ దీని ద్వారా భవిష్యత్తులో పిల్లలకు ఇంటర్ తర్వాత వచ్చే కాంపిటేటివ్ ఎగ్జామ్స్, జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్, ఎంసెట్‌లో రాణించడానికి ఐఐటి ఫౌండేషన్ దోహద పడుతుందని నలంద కరస్పాండెంట్ ప్రసాద్ తెలిపారు. ప్రిన్సిపల్ సాగర్ మాట్లాడుతూ.. కాంపిటీటివ్ యుగంలో అందరికంటే మెరుగ్గా రాణించాలంటే ఇష్టపడి చదవాలని, ఐఐటి అనేది అంతర్జాతీయ స్థాయిలో భారతీయ విద్యార్థుల సత్తాను చాటాలని, దానికనుగుణంగా కసరత్తు చేయాలని విద్యార్థులకు మార్గదర్శనంచేశారు. మొత్తం 360 విద్యార్థులు హాజరయ్యారని ఐఐటి ఇంచార్జ్ హన్మండ్లు, సందీప్, అక్షయ్ కవిత తెలిపారు.

29న ఉద్యోగ మేళా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 29న ఉద్యోగ మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగమేళాకు పివీర్ వేణు మాల్ ప్రైవేట్ లిమిటెడ్, జీవన్‌రెడ్డి మాల్ ప్రైవేట్ లిమిటెడ్, మాల్ ప్రైవేట్ లిమిటెడ్,) (పివిఆర్, వేణుమాల్ ప్రైవేట్ లిమిటెడ్ అండ్ జీవన్ రెడ్డి హెూదా (సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెక్నీషియన్, టీం లీడర్స్, కొమ్మి) నిజామాబాద్ ఆర్మూర్ ప్రాంతంలో ఉద్యోగాలు కలవని తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటి ఎలక్ట్రీషియన్, హెూటల్ మేనేజ్మెంట్ విద్యార్హత ఉండాలని పేర్కొన్నారు. ఆపైన చదివిన అభ్యర్థులు వయోపరిమితి 28 లోపు ఉండాలని తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం నిజామాబాద్ శివాజీ నగర్ ఐటిఐ క్యాంపస్‌లో హాజరు కావాలని పేర్కొన్నారు. బయోడేటా, ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, వెంట తీసుకుని రావాలని తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని మేగ్య నాయక్ తండాకు చెందిన బీజేపీ నాయకులు బదావత్ చందర్ నాయక్, లకావత్ గోపాల్, లకావత్ శర్మన్, కాంగ్రెస్ నాయకులు దేగవత్ శంకర్ నాయక్‌తోపాటు పలువురు నాయకులు ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మోహన్, ఇందల్‌వాయి ఎంపీపీ బదవత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికి గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి జగన్ మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, నిజామాబాద్ రూరల్‌లో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై చేరడం అభినందనీయమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రం అభివృద్ధి చెందకుండా అడుగడుగునా అడ్డుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి చరణ్, ఉప సర్పంచ్ దరిసింగ్,సీనియర్ నాయకులు హుసేన్ నాయక్, గణేష్, ఉదయ్, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కంటి శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

సర్పంచ్ పానుగంటి రూపా సతీష్‌రెడ్డి



మాట్లాడుత్ను సర్పంచ్ రూప

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పానుగంటి రూపా సతీష్ రెడ్డి అన్నారు. సోమవారం డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి గ్రామంలో కంటి శిబిరాన్ని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పానుగంటి రూపా సతీష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీలో నెలకొల్పిన కంటి వెలుగు శిబిరాన్ని గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి కంటి పరీక్ష ఉచిత శిబిరానికి తీసుకు రావడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగారం, ఎంపీటీసీ ఎంబడి సంతోషం, ఎంపీఓ నిట్టు కిషన్ రావు, కారబర్ సురేష్, వైద్యురాలు నవత, మహేష్, మణి తేజ,సుపర్ వైజర్ అక్బర్ అలీ, అంగన్వాడి నిరోష, ఇందిరా, ఆశా కార్యకర్తలు సంధ్య, నిర్మలా, మంజుల తోపాటు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న సర్పంచ్ ధరణి

నవతెలంగాణ-మోర్తాడ్

ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం విద్యార్థులు సోమవారం స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. రహదారి ఇరుపక్కల ఉన్న చెత్త చెదారాన్ని తొలగిస్తూ వ్యాపారస్తులందరూ తప్పనిసరిగా శుభ్రత పాటించాలని సూచించారు. రహదారి పక్కన చెత్త వేయకుండా చెత్త వాహనాల్లో తడి, పొడి చెత్తను వేరుగా వేయాలని అన్నారు. బస్టాండ్ సమీపంలో నున్న పిచ్చి మొక్కలను తొలగించారు. సర్పంచ్ ధరణి మాట్లాడుతూ విద్యార్థులకు సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పెద్దన్న, ప్రోగ్రాం అధికారి, భూపతి తదితరులు పాల్గొన్నారు.

టీబీ పై అవగాహన



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రభాకర్

నవతెలంగాణ-మాక్లూర్

మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో టీబీపై మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధ్వర్యంలో (క్షయ) టీబీ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యలయం నుంచి మాదాపూర్ వరకు నర్సింగ్ స్కూల్ విద్యార్థులతో ర్యాలి నిర్వహించగా ఎంపిపి మస్త ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. అనతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. టీబీ నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపిపి ప్రభాకర్ అన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తాగడం లాంటి లక్షణాలు ఉంటే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని, పూర్తిగా ఉచితంగా చేస్తారన్నారు. ఆసుపత్రిలో ఉంటే పోషణ క్రింద నెలకు రూ. 500 ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. క్షయ నివారణలో భాగంగా నిజామాబాద్ జిల్లాకు బంగారు పథకం లభించిందని, వచ్చే 2025 నాటికి జిల్లాలో క్షయను తరిమి వేయడంలో ముందుండాలని అన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక కేంద్రం వైద్యురాలు సరిత, సీఏచ్ఓ ఆనంద్, సుపరిండెంట్ గుణ శేఖర్, సుధాకర్, లావణ్య ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం పాలసీ అమలైందా?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన జాతీయ విద్యాసంస్కర్త ప్రొఫెసర్ గంటా రమేష్

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం పాలసీ అమలు జరిగిందా? అని జాతీయ విద్యాసంస్కర్త ప్రొఫెసర్ గంటా రమేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పాఠశాలలో విద్య పూర్తిస్థాయిలో నాణ్యతగా జరగడంలేదని, కాలేజీలలో సరిపడా అధ్యాపకులు లేరని, బాల బాలికలకు వేరువేరుగా కాలేజీలు ఏర్పాటు చేసినప్పటికీ రెండు కాలేజీలకు కలిపి ఒకే అధ్యాపకుడు ఉండడం ఇంటి సందర్భాలు ఉన్నాయని తెలిపారు. సోమవారం సారంగాపూర్ లోని తెలంగాణ యూనివర్సిటీ ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో రెండు రోజుల జాతీయ సదస్సును వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సావనీర్‌ను వీసీ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్.విద్యావర్ధిని, జాతీయ విద్యా సంస్కరణ కర్త ప్రొఫెసర్ గంట రమేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ రవిందర్ మాట్లాడుతూ తెలంగాణ యూనివర్సిటీ ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని, పరిశోధన విద్యా కేంద్రాన్ని ప్రారంభిస్తానని తెలిపారు. ప్రముఖ వ్యక్తగా పాల్గొన్న జాతీయ విద్య సంస్కర్త ప్రొఫెసర్. గంటా రమేష్ మాట్లాడుతూ... ఉపాధ్యాయుడు తరగతి గదిలో పాఠం చెప్పాలంటే దానికంటే ముందు ఎంతో సాధన చేయాలని పాఠం చెప్పడం అంటే అంత సులభం కాదని అన్నారు. ఉపాధ్యాయుని నాణ్యత పెంచాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం తీసుకు వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యుఎసి డైరెక్టర్ మామిడాల ప్రవీణ్, ఢిల్లీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రావులకృష్ణ, ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్ సి టి ఈ మెంబర్ డాక్టర్ శంకర్, ప్రిన్సిపాల్ మహేందర్, అధ్యాపకులు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు నిజామాబాద్ జిల్లాలో ఉన్న బీఈ డీ కాలేజ్ ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్స్ , విద్యార్థులు పాల్గొన్నారు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, ప్రొఫెసర్లు

రాహుల్‌పై అనర్హత వేటుకు నిరసనగా

సత్యాగ్రహ దీక్ష



దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేశ వేణు ఆధ్వర్యంలో కాంగ్రెస్ భవన్ వద్ద సత్యాగ్రహ దీక్ష సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిపిసిసి కార్యనిర్వాక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత పేద ప్రజల సంపదను అదానికి చేరవేయడంలో ఆదాని ప్రపంచ కుబేరుడిగా ఎదగడంలో నరేంద్ర మోడీ పాత్ర ఎంతో ఉందని, ఈ విషయాన్ని రాహుల్ గాంధీ నరేంద్ర మోడీని ప్రశ్నించడం ద్వారా దోషిగా నిలబడతామని భయంతో కుట్రపూరితంగా రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారని తెలిపారు. సుప్రీంకోర్టులో విచారణకు నెలరోజుల సమయంతో బెయిల్ ఇచ్చిందని, అయినా పార్లమెంటులో ఒక్కరోజులో రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేశారంటే బిజెపి ఉద్దేశం ప్రతిపక్షాల గొంతు నొక్కడం అని తెలిపారు. పార్లమెంట్ మెంబర్షిప్ ఇంచార్జ్ గాలి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. గతంలో ఇందిరాగాంధీపై కూడా అనర్హత వేటు వేశారని తర్వాత వచ్చినా ఎన్నికల్లో ఇందిరా గాంధీ విజయం సాధించి ప్రధానమంత్రి అయ్యారని, అదేవిధంగా రాహుల్ గాంధీ కూడా వచ్చే ఎన్నికలలో ప్రధానమంత్రి అవుతారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే నరేంద్ర మోడీ రాహుల్ గాంధీపై అనర్హత వేటు కుట్రపూరితంగా వేశారని, రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని పునరుద్ధరించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి,జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, మాజీ బీసీ సెల్ అధ్యక్షులు శేఖర్ గౌడ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామర్తి గోపి, రాష్ట్ర ఎన్ఎస్యుఐ ప్రధాన కార్యదర్శి విపుల్ గౌడ్, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ జావిద్ అక్రమ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా జడ్పీ ఫ్లోర్ లీడర్ అంబర్ సింగ్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాజ నరేంద్ర గౌడ్, పిసిసి మాజీ డెలిగేట్ ఈసా, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతిరెడ్డి రాజారెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిలు తంబాకు చంద్రకళ, ఉషా, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర 2వ మహాసభ గోడ ప్రతులు ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభలు ఏప్రిల్ 2,3 న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరుగనున్నాయని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య కార్మికులకు పిలుపు ఇచ్చారు. సోమవారం ఆర్అండ్బీ అతిథి గృహంలో మహాసభలకు సంబంధించిన గోడ ప్రతులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక లోకం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. తగిన ఉద్యమ కార్యాచరణ మహసభలో రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ మహసభలు విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈ గోడ ప్రతులు ఆవిష్కరణ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీ.సాయిలు, జిల్లా ఉపాధ్యక్షుడు శివరాజు, సహాయకార్యదర్శి దుడ్డు గంగాధర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలు పరిశీలన

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి, బట్టాపూర్, తడపాకల్, తాళ్ళ రాంపూర్‌లో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన హరితహారం నర్సరీలను భీంగల్ ఏడీఏ కంపాటి మల్లయ్య సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ విధిగా తమ పరిధిలోని నర్సరీలోని అన్ని బెడ్స్‌లో విత్తనాలు నాటి అవి మొలకెత్తే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విత్తనాలు నాటిన 45 రోజుల తర్వాత మొక్కలు రాని బెడ్స్‌లో మళ్లీ విత్తనాలు తిరిగినాటాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది రోజువారీగా నర్సరీలలోని మొక్కలను పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేష్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఏడీఏ మల్లయ్య

జాతీయస్థాయి ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య ప్రభంజనం



నవతెలంగాణ-ఆర్మూర్

ఇటీవల విడుదల చేసిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఓలింపియాడ్ పరీక్షలో పట్టణంలోని శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ముత్తు మాట్లాడుతూ ఈ ఒలింపియాడ్ పరీక్షలో జాతీయ స్థాయిలో రెండవ ప్రైజ్‌ని పండిత్ వేదవర్షిణి, మూడవ ప్రైజ్ ఏ.జలనిధి, నాలుగవ ప్రైజ్ ఎస్.గురుప్రీత్, ఐదవ ప్రైజ్‌ను ఎస్. మనస్విని గెలుపొందారని తెలిపారు. వివిధ తరగతులకు చెందిన 30మంది విద్యార్థులు కన్సోలేషన్ ప్రైజ్‌ను, నలుగురు విద్యార్థులకు స్పెషల్ ప్రైజ్‌లు, 63 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికేట్‌తోపాటు బహుమతులు గెలుపొందారని తెలిపారు. ఈ ఒలింపియాడ్ పరీక్షలో పాఠశాల నుండి 118 మంది విద్యార్థులు అనేక బహుమతులను గెలుపొందారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ముత్తు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డిజీఎం లక్ష్మణ్ రావు, ఆర్ఐ రాజు, డీన్ సంతోష్, సీ బ్యాచ్ ఇంఛార్జి రాకేష్, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కంఠేశ్వర్



చలివేంద్రం ప్రారంభించిన ఐద్వా అధ్యక్షురాలు

ఆర్‌జీకే అపార్ట్‌మెంట్స్ శాఖ ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం పేరుతో చలివేంద్రం సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐద్వా మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు సుజాత హాజరయ్యారు. గత సంవత్సరం కూడా మల్లు స్వరాజ్యం పేరుతో చలివేంద్రం ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ.. ఎండాకాలం ప్రారంభం కావడంతో ప్రజలు మంచినీరు దొరకక అనేక ఇబ్బందులు పడుతున్నారని వాటిని దృష్టిలో పెట్టుకొని చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి. శాఖాహార కార్యదర్శి శారద, ఐద్వా నగర కమిటీ సభ్యురాలు శ్రీదేవి, శాఖ సభ్యురాలు జమున రాణి, కవిత, రుక్సానా, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

నవతెలంగాణ-మోపాల్



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

మండలం లోని ముదక్ పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు తృణ ధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనత, పరిశుభ్రత, పోషక ఆహార విలువల గురించి వివరించారు. గర్భిణీ స్త్రీలకు శీమంతాలు నిర్వహించారు. ఏడు నెలల పిల్లలకి అన్న ప్రాసన్న కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఓ సౌందర్య మాట్లాడుతూ బాలింతలకు తల్లిపాల గురించి వివరిస్తూ దాని ప్రాముఖ్యతను తెలియజేస్తూ వారికి పోషక విలువల గురించి ఒక గర్భిణీ స్త్రీ ఎలా ఉండాలో ఎలాంటి వ్యాయామాలు చేయాలో నార్మల్ డెలివరీ గురించి తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు జాకిర బేగం, సమీనా స్వరూప సీతాకుమారి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, పాఠశాల సిబ్బంది, కిషోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

వీడీసీ సభ్యులకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్



వీడీసీ సభ్యులను సన్మానించిన కౌన్సిలర్లు

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నూతన విడిసి కార్యవర్గ సభ్యులను సోమవారం స్థానిక కౌన్సిలర్లు సన్మానించారు. ప్రవీణ్‌గౌడ్, లక్కారం నరేష్, సళ్ళ రాజన్న, తూర్పు నడపి రాజన్న, చిట్ల నవీన్, నరేష్ తదితరులను ఇటీవల ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోన పత్రి కవిత కాశీరాం, మేడిదాల రవి గౌడ్, ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.

రైలా అద్భుత కార్యక్రమం

- నిజామాబాద్ జిల్లా సెషన్స్ జడ్జ్ సునీత కుంచాల
- రోటరీ యూత్ లీడర్‌షిప్ అవార్డ్స్ ప్రోగ్రాం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఆధ్వర్యంలో స్థానిక దాస్‌నగర్‌లోగల నవ్యభారతి గ్లోబల్ పాఠశాలలో రైలా 2023 (రోటరీ యూత్ లీడర్‌సిప్ అవార్డ్స్ ప్రోగ్రాం)ను ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు సతీష్ షాహ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుల విశాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి చైర్మన్‌గా రావులపల్లి జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఎనిమిది, తొమ్మిది తరగతి విద్యార్థులకు ప్రతి ఏడు రోటరీ నిజామాబాద్ ఆధ్వర్యంలో రోటరీ యూత్ లీడర్షిప్ అవార్డ్స్ కార్యక్రమం ద్వారా నాయకత్వ లక్షణాలు గల తరగతులను, నేటి సమాజం యువత కర్తవ్యం అలాగే ఉన్నత విద్య సమయస్ఫూర్తి వంటి అంశాలపై కార్యక్రమాలను ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ జిల్లా సెషన్స్ జడ్జ్ సునీత కుంచాల హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులను తీర్చిదిద్దాలనే ఉన్నతమైన ఆశయాన్ని సాధించాలన్న లక్ష్యంతో రోటరీ వారు నిర్వహిస్తున్న ఈ రైలా చాలా అద్భుతమని అన్నారు. విద్యార్థి దశ నుండి ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని ముందుకు ప్రయాణించటం ఒక ఉన్నతమైన ఆలోచన అని జడ్జి కొనియాడారు. గౌరవ అతిథులుగా ప్రముఖ సైకియాట్రిక్ సినీ కళాకారులు డాక్టర్ వై. శ్రీధర్, రోటరీ జిల్లా 3150 2025-26 గవర్నర్ శరత్ చౌదరి హాజరై మాట్లాడుతూ.. ఉన్నత విద్య తదుపరి లక్ష్యాల గురించి రోజువారి దినచర్యలో క్రమశిక్షణపై తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో నవ్య భారతి గ్లోబల్ స్కూల్, హెూవార్డ్, బ్లూమింగ్ బర్డ్స్ మాణిక్ భవన్ అక్షర్ధామ్ నిర్మల హృదయ తదితర పాఠశాల నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం జరిగినది. రోటరీ సభ్యులైనటువంటి రీజినల్ రైలా చైర్మన్ కే సంతోష్ కుమార్, రైలా వైస్ చైర్మన్ వి శ్రీనివాసరావు, పార్సి రాజేశ్వర్, వెద్రప్రకాష్ మెటల్‌ఆకుల అశోక్, విజయరావు, ధీరజ్ రెడ్డి, ప్రసన్న కుమారి, మోటూరి శ్రీనివాస్, ట్రైనర్ చంద్రశేఖర్ , నవ్య భారతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్సన్నపల్లిలో కంటి వెలుగు ప్రారంభం

- సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇసనపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, సర్పంచ్ కందూరి బాలామణి లింబాద్రితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దశరథ్‌రెడ్డి మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని, అవసరమున్న వారికి కంటి అద్దాలు, ఆపరేషన్లు ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తుందని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీందర్రావు, రైతుబంధు మండలాధ్యక్షులు నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ బంటు రాజేందర్, టీఆర్ఎస్ మండలాధ్యక్షులు రంగు రవీందర్‌గౌడ్, కాసర్ల రాజేందర్, కందూరి లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పోషణ పక్వాడపై అవగాహన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని ఎన్ఎస్ఎఫ్ స్టోర్ (అంబేద్కర్ నగర్) గ్రామంలో సర్పంచ్ మధుర భాయ్ అధ్యక్షతన పోషణ్ పక్వాడ పై అవగాహన కల్పించినట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి తెలిపారు. చిరుధాన్యాలైన రాగులు, అవిసెలు, జొన్నలు, కొర్రలు, రాగి, అంబలి, గోధుమలు తదితర చిరుధాన్యాలను ప్రతిరోజు ఆహారంలో తీసుకుంటే ఇలాంటి అనారోగ్యం కలగకుండా ఉంటుందన్నారు. వీటిని వాడటం వల్ల బీపీ షుగర్లు దరిచేరవని ఆమె పేర్కొన్నారు. చిరుధాన్యాలలో విటమిన్ బీ12, ఐరన్, కార్బోహైడ్రేడ్‌లు ఎక్కువగా ఉంటాయన్నారు. బాలింతలు, గర్భిణీలు వీటిని తప్పక పాటించాలని ఆమె సూచించారు. తమ పెరట్లో న్యూ ట్రీ గార్డెన్లో ఏర్పాటు చేసుకొని ఆకుకూరలు కాయగూరలు పండించుకోవాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పూజ, పాలకవర్గ సభ్యులు వందనాబాయి, మంగళ్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాల సంఖ్యను పెంచాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వసతులు, సమస్యలపై అధికారులతో సమీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల సంఖ్యను పెంచాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో ఆయన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వసతులు, సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్యా బోధన కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తారని చెప్పారు. మొక్కల పెంపకం కోసం నర్సరీలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తేనెటీగల పెంపకం చేపట్టాలని కోరారు. విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించాలన్నారు. ఎల్లారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఆవరణలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కళాశాల స్థలం అక్రమణకు గురి కాకుండా చూడాలని కోరారు. సమావేశంలో మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడ ప్రిన్సిపాల్ డాక్టర్ కిష్టయ్య, ప్రవీణ్ కుమార్, గంగాధర్, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

కులమతాలకతీతంగా సేవ చేయడం అదృష్టం

- సాటాపూర్ సర్పంచ్ వికార్ పాషా



స్వాములకు అన్నదానం చేస్తున్న సర్పంచ్ వికార్‌పాషా

నవతెలంగాణ-రెంజల్

కులమతాలకతీతంగా సేవ చేయడం అదృష్టమని సాటాపూర్ సర్పంచ్ వికార్ పాషా అన్నారు. మండలంలోని సాటాపూర్ గ్రామంలోని హనుమాన్ మందిరంలో హనుమాన్ దీక్షపరులకు స్థానిక సర్పంచ్ వికార్ పాషా అన్న దాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా హనుమాన్ దీక్షపరులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు, గ్రామంలోని నిరుపేద కుటుంబాల వివాహ సమయంలో తనకు తోచిన విధంగా ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్టు తెలిపారు. నిరుపేదలకు సేవలను అందించడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు భూమేష్, పాలకవర్గ సభ్యులు కంఠం గంగారం, శ్రీకాంత్, సంతోష్, ప్రశాంత్, జాడీ సాయిలు, సాయిలు, మధు, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

గోదాం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సొసైటీ చైర్మెన్

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో గోదాం నిర్మాణానికి సొసైటీ చైర్మన్ మర్రి సదాశివారెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సదాశివరెడ్డి మాట్లాడుతూ.. రైతుల సౌకర్యం కోసం సొసైటీ నిధుల నుంచి రూ.16లక్షలతో 250 మెట్రిక్ టన్నుల గోదామును నిర్మిస్తున్నామని అన్నారు. రైతుల మేలు కోసం సొసైటీల ద్వారా అనేక సేవలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్‌రెడ్డి, జెడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ దండ బోయిన సంజీవ్, వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, వైస్ ఎంపీపీ రవీందర్రావు, సొసైటీ డైరెక్టర్లు లక్ష్మాగౌడ్, రాములు, ఎడ్ల నరసవ్వ, ప్రవీణ్ రెడ్డి, రైతుబంధు అధ్యక్షులు నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ పోతు నూరి ప్రసాద్, కాసర్ల రాజేందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్, నాయకులు తుపాకుల రాజేందర్ గౌడ్, శ్యామ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మెన్

నవతెలంగాణ-తాడ్వాయి

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఏఎంసీ చైర్మెన్ పులగం సాయిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కపిల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కరడుపల్లి గ్రామంలో మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశానుసారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ దేశానికే ఆదర్శమని, ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే సహకారంతో మరింత అభివృద్ధి చేపడతామని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ బత్తుల రమాదేవి నారాయణ, ఎంపీపీ కౌడి రవి, వైస్ ఎంపీపీ ముదాం నర్సింలు, మండలాధ్యక్షులు మద్ది మహేందర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార సముదాయాల కేటాయింపులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని పాత బస్టాండ్‌లో నూతనంగా నిర్మించిన వ్యాపార సముదాయాలను గత రెండు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఆర్డీఓ రాజేశ్వర్ పండ్ల వ్యాపారులకు కేటాయించారు. ఈ మడిగెలను ఒక వర్గానికి మాత్రమే ప్రయోజనం చేకూరేలా కేటాయించారని దానిని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బోధన్ మున్సిపల్ పరిధిలోని స్థానిక పాత బస్టాండ్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన పండ్ల దుకాణాల సముదాయానికి సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా గత రెండు రోజుల కిందట 19 దుకాణాలను ఒక వర్గానికి సంబంధించిన వారికి కేటాయించారని ఆరోపించారు. కావున కేటాయింపులు రద్దు చేసి వాటికి టెండరు పద్ధతి ద్వారా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిని పాటిస్తూ, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మారోజు సుధాకర్ చారి, పట్టణ అధ్యక్షులు కొలిపాక బాలరాజు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్, సీనియర్ నాయకులు మిద్దెల రామరాజు పాల్గొన్నారు.

రక్తదానం

నవతెలంగాణ-సదాశవనగర్

కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాలు విరిగి చికిత్స పొందుతున్న పాల్వంచ గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళకు అత్యవసరంగా ఏబీ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వారి కుటుంబ సభ్యులు జిల్లా రక్తదాతల సేవాసమితి నిర్వాహకులను సంప్రదించడంతో సదాశివనగర్ మండలం ధర్మారావుపేట్ గ్రామ ఎంపీటీసీ, బీజేపీ జిల్లా కార్యదర్శి మహిపాల్ యాదవ్ సహకారంతో వారికి కావలసిన ఏబీ పాజిటివ్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతకు జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీల్లో అన్ని రకాల సేవలు

- సొసైటీ చైర్మెన్లు
- సహకార సంఘాల మహాజన సభలు

నవతెలంగాణ-బోధన్/బిచ్కుంద

సొసైటీల ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తున్నామని సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్ బాబు అన్నారు. సోమవారం మండలంలోని పెంటఖుర్దు గ్రామ సొసైటీలో ఆయన అధ్యక్షతన మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ బాబు మాట్లాడుతూ.. సహకార సంఘం ద్వారా రైతుల పంటలను సకాలంలో కొనుగోలు చేస్తూ ప్రభుత్వంచే మద్దతు ధర కల్పిస్తున్నామని తెలిపారు. రైతులకు సొసైటీ ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తున్నామని, రైతులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సొసైటీలో నిర్వహించిన లావాదేవీలు, ఆదాయ వ్యయాలను రైతులకు చదివి వినిపించారు. అనంతరం ఇఫ్కో సేల్స్ ఆఫీసర్ రామకృష్ణ నానో యూరియా ఉపయోగాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్, సంఘం డైరెక్టర్లు, సంఘ సీఈఓ పోతారెడ్డి, సిబ్బంది సంఘం పరిధిలోని గ్రామాల సర్పంచులు, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.



బిచ్కుంద : పుల్కల్‌లో మాట్లాడుతున్న చైర్మెన్ మందాడి రామిరెడ్డి

పుల్కల్‌లో మహాజనసభ..

బిచ్కుంద : మండలంలోని పుల్కల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో చైర్మన్ మందాడి రామిరెడ్డి ఆధ్వర్యంలో మహాజనసభను నిర్వహించారు. ముందుగా సీఈఓ సాయి ప్రకాష్ అర్ధవార్షిక నివేదికలు చదివి వినిపించారు. సహకార సంఘం ద్వారా పెద్దదడిగి, బండరేంజల్ గ్రామాలలో గోదాముల నిర్మాణం, ప్రస్తుతం వాజిద్‌నగర్ గ్రామ రైతులు పండించిన పంటలను ఐకేపీ ద్వారా కొనుగోలు చేస్తున్నారని దానిని పుల్కల్ సొసైటీకి మార్చి రైతుల పండించిన పంటలను సొసైటీ ద్వారానే కొనుగోలు చేయాలని తీర్మానాలు చేశారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి రైతు సహకార సంఘం అభివృద్ధికి తోడ్పడాలని అధ్యక్షులు రామిరెడ్డి కోరారు. డైరెక్టర్లు సంతోష్, శ్రీనివాస్, సీఈఓ సాయిప్రకాష్, కిష్టారెడ్డి, భూంశెట్టి, రాజుపటేల్, నాగంగంగారం, కొట్టం వీరేశం, సంఘం కార్యవర్గ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

రైతుల సౌకర్యార్థమే

పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలు

- సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్

నవతెలంగాణ-బోధన్

రైతులు పండించిన పొద్దుతిరుగుడు పంట దళారుల పాలు కాకుండా, రైతులకు లాభం చేకూర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం మేరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని సాలూర సొసైటీ అధ్యక్షులు అల్లే జనార్దన్ అన్నారు. సోమవారం సాలురా సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన పొద్దు తిరుగుడు పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయించాలని, తద్వారా క్వింటాకు రూ.6400లు ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతు బీమా లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, మండల వ్యవసాయ అధికారి సంతోష్, ఏఈఓ అపర్ణ, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, సీఈఓ బస్వంత్ రావు, ఫతేపూర్ సర్పంచ్ అమీర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జనార్ధన్

పెంటాకలాన్‌లో..

మండలంలోని పెంటాకలాన్ గ్రామంలోని సొసైటీలో సొసైటీ చైర్మన్ రాజిరెడ్డి పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పెంటా కలాన్ సర్పంచ్ రమణ, పెగాడపల్లి సర్పంచ్ శంకర్, లంగ్డాపూర్ సర్పంచ్ పవన్, ఏఈఓ సరోజ, సొసైటీ కార్యదర్శి బాబా, బోధన్ టీఆర్ఎస్ యూత్ వైస్ ప్రెసిడెంట్ మేడి రవి, సొసైటీ డైరెక్టర్లు రాంబాబు, గంగాధర్, రైతులు కృష్ణారెడ్డి, పీరయ్య, లక్ష్మారెడ్డి, గంగాధర్, సాయిలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రికి కృషి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చడానికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ తీగల తిర్మాల్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సహకారంతో దోమకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మైక్రోస్కోప్ కంటి ఆపరేషన్లకు సంబంధించిన మిషన్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. మోతి బిందు ఉన్న వ్యక్తులు దోమకొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ చేసుకునేలా అన్ని వసతులు ఉన్నాయని వైద్యాధికారి సంగీత్ కుమార్ కల్పించినట్టు తెలిపారు. దోమకొండ ఆసుపత్రిలో ప్రతిరోజు పెద్ద ఎత్తున వైద్యులు ఓపీ చూస్తున్నారని, వివిధ రకాలుగా వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులకు మందులను అందించనున్నట్టు తెలిపారు. ఆస్పత్రిలో ఈసీజీ, స్కానింగ్, కంటి ఆపరేషన్ వసతులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు శమ్మి, వైద్యులు శ్రీవాణి పద్మావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిర్మల్‌గౌడ్

చిట్యాలలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని చిట్యాల గ్రామంలో మార్పు కోసం ఒక్క అడుగు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఎస్వీ శ్రీజ హాస్పిటల్ గాంధారి, ప్రొఫెసర్ డాక్టర్ రామ్‌సింగ్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 450 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులను ఉచితంగా అందజేశారు. ఇందులో భాగంగా అవసరమైన వ్యక్తులకు బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ సేవాసమితి ప్రతినిధి, గుండారం ఎంపీటీసీ హాజీ నాయక్ మాట్లాడుతూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లను అలవర్చుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు. మార్పు కోసం ఒక్క అడుగు ప్రతినిధులు సంజీవరెడ్డి, సుభాష్‌గౌడ్, సురేష్, భూపతి గౌడ్, మహిపాల్ మాట్లాడుతూ.. వివిధ గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలకు సహకరిస్తున్న ప్రొఫెసర్ రామ్‌సింగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో మరింత ముందుకు వెళ్తామని తెలిపారు. చిట్యాల సర్పంచ్ కవిత మాట్లాడుతూ.. చిట్యాల గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్మీ జవాన్లు సురేష్, మార్పు కోసం ఒక్క అడుగు ప్రతినిధులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించే సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బోధన్ పట్టణ అధ్యక్షులు పాషా మోహిని అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం అనర్హత వేటు వేసినందుకు నిరసనగా రేపు అంబేద్కర్ చౌరస్తాలో ఉదయం 10గంటలు నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సారథ్యంలో సత్యాగ్రహ దీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యాకర్తలు, యువజన నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు గంగాశంకర్, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు అబ్బగొని గంగాధర్‌గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి విష్ణు వర్ధన్‌రెడ్డి, దాము పాల్గొన్నారు.

మానవ సంబంధాలను ఆవిష్కరించిన 'బలగం'



బలగం సినిమాను తిలకిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-రెంజల్

తెలంగాణ పల్లెలలో ప్రతి గడపలో ఉండే నిజమైన ఘటనలను కండ్లకు కట్టినట్టు చూపించిన సినిమా బలగమని కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షులు లచ్చేవార్ నితీన్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని సాటాపూర్ గ్రామంలోని గాంధీ విగ్రహం ఎదుట గ్రామస్తులకు ఉచితంగా బలగం సినిమాను చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతికున్నప్పుడు మనకు బంధం, అనుబంధాల విలువ తెలియదని, వృద్ధులయ్యాక కనీసం గంజినీరైనా పోయరని, కానీ ప్రాణం పోయాక మాత్రం కాకికి పిండి వంటలు పెడతారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో ఉన ప్రతి వ్యక్తి ఈ సినిమాను చూసైనా కొంత మార్పు వస్తుందన్న ఆలోచనతో తానే స్వయంగా గ్రామస్తులందరికీ ఈ సినిమాను చూపించినట్టు పేర్కొన్నారు.

చెరుకు కూలీలకు దుస్తులు పంపిణీ



ఒడిబియ్యంపోసి దుస్తులను అందజేస్తున్న రైతు పెంటయ్య

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మోతే గ్రామానికి చెందిన రాపర్తి పెంటయ్య అనే రైతు వలస వచ్చిన చెరుకు కూలీలకు సోమవారం వారి నివాసపు గుడిసెల వద్ద దుస్తులను పంపిణీ చేశారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని వడ్లం గ్రామానికి ఎనిమిది కుటుంబాలు చెరుకు నరికేందుకు డిసెంబర్ నెలలో మోతె గ్రామానికి వచ్చారు. మోతే గ్రామానికి రాపర్తి పెంటయ్య దళిత రైతు పది ఎకరాలలో చెరుకు నరకడంలో నిమగ్నమయ్యారు కొడంగల్ మండలం వడ్లం తాండకు చెందిన దళపతి నాయక్, దేవిదాస్, లాల్ సింగ్, హనుమాన్లు, కిస్తూ నాయక్, రాందాస్‌తో పాటు పలువురు చెరుకు నరికేందుకు రాగా.. మోతే గ్రామానికి చెందిన రాపర్తి పెంటయ్య అనే రైతు కార్మికులకు ఓడి బియ్యం పోసి దుస్తులు పెట్టారు. దీంతో వలస కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

జల్లిపల్లిలో కుస్తీ పోటీలు



కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని జల్దిపల్లి గ్రామంలో కుస్తీ పోటీలు సోమవారం నిర్వహించినట్టు సర్పంచ్ కల్లు రవీందర్ తెలిపారు. ప్రతి ఏటా ఆనవాయితీగా ఉగాది పండుగ అనంతరం కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. టెంకాయ కుస్తీ నుంచి మొదలుకొని వెండి కడియం వరకు కుస్తీ పోటీలను నిర్వహించారు. కుస్తీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. ఈ పోటీలను పలువురు ఆసక్తితో తిలకించారు. కుస్తీ పోటీలకు మహారాష్ట్ర, కర్ణాటక ఇతర ప్రాంతాల నుంచి మల్లయోధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు సర్పంచ్ కల్లు రవీందర్ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు వెండి కడియాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు గడపగడపకూ తీసుకెళ్లాలి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడానికి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలని నస్రుల్లాబాద్ ఎంపీపీ పాల్త్య విఠల్, మండలాధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండలంలోని సంగం, హాజీపూర్ గ్రామాల్లో టీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీని, నాయకులను, ప్రజాప్రతినిధులను, కార్యకర్తలను మహిళలను, యువకులను అందర్నీ కలుపుకొని నాలుగు గ్రామాలను ఒక యూనిట్‌గా తీసుకొని సమావేశం నిర్వహించి రాబోయే ఎన్నికలు సమయాత్తం కావాలని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్ మజీద్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన మందులు విక్రయించాలి

నవతెలంగాణ-ఎడపల్లి

రైతులకు నాణ్యమైన మందులు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రామేశ్వరావు అన్నారు. సోమవారం మండలంలోని జానకంపేటలో గల శ్రీ సాయి ఫర్టిలైజర్ ట్రేడర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలం చెల్లిన మందులను నిలువ ఉంచితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అభ్యంతకర పోస్టులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-భీంగల్

పట్టణ అధ్యక్షుడు చిన్ని నర్సయ్యపై పెట్టిన కేసు వివరాలను బీజేపీ బాల్కొండ నియోజకవర్గ నాయకుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి భీంగల్ పోలీస్‌స్టేషన్‌లో అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నాయకురాలిపై సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్ట్ షేర్ చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీంతో ప్రధానీ మోడీ, బండి సంయ్, ఎంపి అరవింద్‌పై బీఆర్ఎస్ నాయకులు షేర్ చేసిన అభ్యంతకర పోస్టలను పోలీసులకు చూపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ పోస్టులను పోలీసులకు చూయించడంతో విచారణ జరిపి కేసులు నమోదు చేస్తామని హామీ ఇచ్చినట్లు మల్లీఖార్జున్ రెడ్డి తెలిపారు. ఈయన వెంట మండల అధ్యక్షుడు మూలిగే హహిపాల్,చిన్ని నర్సయ్య, దయ్య ప్రవీణ్, అరుణ్, నవీన్, లక్ష్మినారాయణ, గణ మరియు కార్యకర్తలు ఉన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌ను మార్చండి

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెన్షనర్ల, ఉద్యోగులు, జర్నలిస్టులు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వెల్నెస్ సెంటర్ ప్రభుత్వ ఆసుపత్రి నాల్గవ అంతస్తు నుండి మార్చేందుకు సహకరించాలని కోరుతూ సోమవారం నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ నీతూ కిరణ్ శేఖర్‌ను తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ నాయకత్వం కలిసి విజ్ఞప్తి చేసింది. వయోవృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు, నాల్గవ అంతస్తుకు వెళ్లి వైద్య సేవలు, మందులు, పొందటం చాలా ఇబ్బందికరంగా మారిందని, లబ్ధిదారులు వెల్నెస్ సెంటర్కు రావటం బాగా తగ్గిపోయిందని వారు తెలిపారు. తప్పక సమస్యను పరిష్కరిస్తామని మేయర్ హామీ ఇచ్చారు. మేయర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు రామ్మోహన్రావు జిల్లా నాయకులు ముత్తారం నరసింహస్వామి, ఈవీఎల్ నారాయణ, ప్రసాద్ ఉన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- **కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు**

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 110 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఓ చందర్, జెడ్పి సీఈఓ గోవింద్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్ లైన్ లో అప్లోడ్ చేయడంతో పాటు అర్జీదారులకు సమాచారం అందించాలని సూచించారు. వచ్చే సోమవారం నాటికి ఫిర్యాదులేవీ పెండింగ్లో ఉండకుండా పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి విధిగా జిల్లా అధికారులే హాజరు కావాలని, క్షేత స్థాయి పర్యటనకు వెళ్లాల్సిన సందర్భంలో శాఖాపరమైన అంశాలపై పూర్తి అవగాహన కలిగిన కింది స్థాయి అధికారి ప్రజావాణికి హాజరయ్యేలా చూడాలన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రత్యేక అధికారులు ప్రతీ వారం క్షేత్రస్థాయి పరిశీలన జరపాలి

కంటి వెలుగు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, మన ఊరు - మన బడి, నర్సరీలు, హరితహారం, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలన జరిపేందుకు వీలుగా మండల ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో విరివిగా పర్యటించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. ఎక్కడైనా లోటుపాట్లు, సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష జరిపారు. వారానికి కనీసం ఒక గ్రామాన్ని తప్పనిసరిగా సందర్శించాలని అన్నారు. వేసవి ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా నర్సరీలు, ప్రకృతి వనాలు, ఇతర ప్రదేశాల్లో మొక్కలు ఎండిపోకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. వేసవి తీవ్రతతో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా ఉపాధి హామీ కూలీలు పని చేసే ప్రదేశాల్లో, జన సమూహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సరిపడా నీడ, తాగునీటి వసతి అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. ఏప్రిల్ 11 న దిశా సమావేశం జరగనున్నందున కేంద్ర నిధులతో చేపడుతున్న కార్యక్రమాలు, అమలవుతున్న పథకాల పూర్తి వివరాలతో సంబంధిత శాఖల అధికారులు ఈ నెలాఖరులోపు డీ ఆర్ డీ ఓ కు నివేదికలు అందించాలని కలెక్టర్ సూచించారు. పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, లైన్ డిపార్ట్మెంట్లు సమన్వయంతో పని చేయాల న్నారు. ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాలు ఏవైనా ఇంకనూ అద్దె భవనాల్లో కొనసాగుతున్నట్లైతే వెంటనే సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోకి మారాలన్నారు. ఏప్రిల్ నెలనుండి ఎట్టి పరిస్థితుల్లోనూ అద్దె చెల్లించబడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి నిర్మూలన చర్యలను సమర్థవంతంగా చేపడుతుండడంతో జాతీయ స్థాయిలో అవార్డు వచ్చిన సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం ను అభినందించారు. అధికారులు, సిబ్బంది అందరి సమిష్టి కృషితో జిల్లాకు జాతీయ స్థాయి అవార్డు దక్కిందని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఆటోబోల్తా పలువురికి గాయాలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని తక్కడపల్లి సమీపంలోని 36 హెూటల్ వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. చిన్నదేవాడ గ్రామం నుంచి చిన్నకొడప్‌గల్ గ్రామానికి బంధువుల ఇంటికి శుభకార్యానికి ఆటోలో వెళ్తుండగా.. ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. దీంతో పలువురికి గాయాలయ్యాయి. అదే మార్గంలో వెళ్తున్న ఎంపీపీ ప్రతాపరెడ్డి, యువ నాయకుల హరీష్ షిండే గమనించి అంబులెన్స్‌కు ఫోన్‌చేసి గాయాలపాలైన ప్రయాణికులను ఆసుపత్రికి తరలించారు.

జేసీబీ, ట్రాక్టర్లు పట్టివేత

- **కేసు నమోదు చేసి ఠాణాకు వాహనాల తరలింపు**



పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాలు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని రామడుగు గ్రామ సరిహద్దులో కొందరు యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తూ లక్షలు గడిస్తున్నారు. కొందరు ఓముఠాగా ఏర్పడి ప్రభుత్వ సెలవుల్లో సైతం ఏకంగా జెసిబి లతో ఇసుక తవ్వుతూ ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఇదేంటని ఎవరైనా అడిగితే ప్రభుత్వ కార్యాలయాలకు అభివృద్ధి పనులకు తీసుకెళ్తున్నామని చెప్పుకుంటూ దోచేస్తున్నారు. గత కొంతకాలంగా ప్రభుత్వ అధికారులకు సమాచారం అందిస్తూ వారికి కొంత ముట్ట చెప్పుతూ గుట్టు చప్పుడు కాకుండా ప్రతి రోజు వందల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఆదివారం మండలంలోని రామడుగు శివారు వాగు ప్రాంతం నండి సుద్దులం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు యథేచ్ఛగా జేసీబీలతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు తెలుసుకొని ధర్పల్లి ఎస్ఐ వంశీ కృష్ణ తన సిబ్బందితో వెళ్లారు. సంబంధిత ధ్రువపత్రాలు చూపాలని సదరు వ్యక్తులకు అడుగగా ప్రభుత్వ అభివృద్ధి పనులకు తీసుకెళ్లుతున్నామని తెలిపినట్లు తెలిసింది. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా ఎలాచేస్తారని జెసిబి, మూడు వాహనాలను ఠాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వంశీ కృష్ణ సోమవారం విలేకరులకు తెలిపారు.

నేడు ధాత్రి విశిష్ట సేవ పురస్కారాల ప్రధానోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ధాత్రి సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ధాత్రి విశిష్ట సేవారత్న పురస్కారాల ప్రదానోత్సవం నేడు గౌతమి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నట్టు ఆ సంస్థ అధ్యక్షురాలు మల్లవరపు విజయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరోనా సమయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించిన స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు2022 సంవత్సరానికి గాను ఈ పురస్కారాలను అందచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కవులు, కళాకారులు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాల ప్రహరీకి రూ.5 లక్షలు మంజూరు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

మండలంలోని జలాల్‌పూర్ స్కూల్ ప్రహరీ గోడ కోసం 5 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈపనులకు సోమవారం భూమి పూజ చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా ఆర్థిక ప్రణాళిక సభ్యులు జిల్లా ఒలింపిక్ ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ సీడీపీ నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొల్లెంక సుమలత గోపాల్ రెడ్డి పార్టీ మండల ప్రెసిడెంట్ మీసాల మధుకర్, వైస్ ఎంపీపీ, పీఏసీఎస్ చైర్మన్ దాసరి శ్రీధర్, మైనార్టీ సెల్ అధ్యక్షులు జామీర్ ఖాన్, సర్పంచ్ మేకల స్వప్న, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జె భూమేశ్వర్ ఫర్టిలైజర్స్ సీడ్ అండ్ పెస్టిసైడ్స్ వారి ఆధ్వర్యంలో యజమాని జొన్నల భూమేశ్వర్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం కంట్రోలర్ నాగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంట్రోలర్ నాగేష్ మాట్లాడుతూ ఎండలు ముదిరినందున బస్టాండ్ లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుకు సహకరించాలని కోరిన వెంటనే స్పందించి, సహకరించిన దాత భూమేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మూడు నెలల పాటు చలివేంద్రంలో ఏర్పాటు చేసిన రంజన్లలో డ్రింకింగ్ వాటర్ పోయించేందుకు దాత ముందుకు వచ్చినట్లు తెలిపారు. చలివేంద్రం ఏర్పాటు ద్వారా బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తి కష్టాలు తీరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులతో పాటు ప్రయాణికులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కంట్రోలర్

జక్రాన్‌పల్లిలో ధ్వజ స్తంభ ప్రతిష్టాపన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర మందిరంలో ధ్వజ స్తంభం ప్రతిష్టాపన సోమవారం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధ్వజ స్తంభం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్ జక్కం చంద్రకళ బాలకిషన్, ఎంపిటిసిలు గంగారెడ్డి సతీష్. పైపుల రాజారెడ్డి, నాయకులు నట్ట భోజన్న బుల్లెట్ అక్బర్, వీడిసి సభ్యులు, నాయకులు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

29న వాహనాల వేలం పాట

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నేడు ఉదయం 10.30 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నామని నిజామాబాద్ ఎక్సైజ్ సీఐ మధుసూదన్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో జరిగే వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

నేడు మంత్రి పర్యటన

నవతెలంగాణ-మోర్తాడ్

నేడు మండల కేంద్రంలోని ఆర్ అండ్‌బీ ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళన నానికి మంత్రి ప్రశాంత్ రెడ్డి వస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు ఏలియా తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని టీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. అనంతరం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ డివైడర్ పనులను ఆయన ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ధాన్యం ఆరబెట్టడానికి స్థలం కేటాయించాలి

నవతెలంగాణ-నందిపేట్

పదిహేను రోజుల్లో రబి కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వరి ధాన్యం ఆరబెట్టేందుకు స్థలాన్ని కేటాయించాలని సోమవారం సర్వ సమాజ్ అధ్యక్షుడు పండరి రాజు అధ్యక్షన ఎంపీడీవో నాగవర్ధన్ కు వినతిపత్రం అందజేశారు.. ధాన్యం ఆరబెట్టేందుకు అనువైన స్థలం లేక ఎంతో ఇబ్బంది పడుతున్నామని రైతులందరు ఆయనకు వివరించారు. దీనికి ఎంపీడీవో సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే మండల కేంద్రంలో వడ్లు ఆరబోయడానికి స్థలాన్ని చూస్తానని పై అధికారుల చొరవతో కల్లాల ఏర్పాటుకు నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కొత్తూరు భూషణ్, కొత్తూరు భాస్కర్, గాండ్ల సంతోష్, మూడేడ్ల లింగం, చిన్నయ్య శీను ,శ్రీకాంత్, మైపాల్ తదితర రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

తండా అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన 5 లక్షల రూపాయలతో గంగారాం తండాలోని హన్మన్ ఆలయం నుండి తండా వరకు సిసి రహదారి నిర్మాణానికి తిర్మన్‌పల్లి ఎంపిటిసి చింతల దాస్ సోమవారం కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతల దాస్ మాట్లాడుతూ.. ఇందల్‌వాయి మండల కేంద్రంలోని గంగారాం తండా లో మిగిలిపోయిన చోట్ల ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో నిధులు మంజూరు అయిన వెంటనే మిగిలిన పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. సీసీ రాహదరి నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తిచేసే విధంగా కాంట్రాక్టర్ చూడాలని దాస్ అన్నారు. కార్యక్రమంలో గ్రామఅభివృద్ధి కమిటీ అధ్యక్షులు సతిష్, మాజీ గోవర్ధన్, సంజీవ్‌రెడ్డి, సభ్యులు ఏంబడి రెడ్డి, నరహరి, వార్డు సభ్యులు గణేష్, సాయిలు, శ్రీను, భూమయ్య భూషణ్, వినోద్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

పీఈటీని అబినందించిన మంత్రి

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ పట్టణకేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులు కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో పీఈటీ సువర్ణను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. మెట్‌పల్లిలో జరిగిన పోటీల్లో కస్తూర్బా విద్యార్థులు 20 మంది బంగారు పథకాలు సాధించారు. వీరికి పీఈటీ సువర్ణ శిక్షణను అందజేశారు. మంత్రి వెంట జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి, ఎంపిపి ఆర్మూర్ మహేష్, ఏపియం కుంట శ్రీనివాస్, సీసీలు నరేష్ , భాస్కర్ తదితరులున్నారు.

నేడు వికలాంగులకు ఉచిత బస్ పాసులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గ్రామంలోని వికలాంగులకు ఉచిత బస్సు పాసులు పంపిణీ చేయడం జరుగుతుందని జక్రాన్‌పల్లి సర్పంచ్ చంద్రకళా బాలకృష్ణ సోమవారం తెలిపారు. గ్రామంలో ఉన్న వికలాంగులు వారి సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈనెల 28న ఉదయం 9.00 గంటలకు హాజరు కావాలని కోరారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

- **బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం**
- **జిల్లా బాలల సంరక్షణ అధికారిని జమూరు**

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్ర పరిధిలోని గాంధీ నగర్‌లో బాల్యవివాహం చేసేందుకు చేసిన ఏర్పాట్లను అధికారులు అడ్డుకున్నారు. గాంధీనగర్ కు చెందిన 13 సంవత్సరాల మైనర్ అమ్మాయికి, 17 సంవత్సరాల మైనర్ అబ్బాయికి ఈనెల 28న వివాహం జరిపేందుకు ఇరువురి కుటుంబ సభ్యులు పెళ్లి పందిళ్ల వేసి ఏర్పాట్లు చేశారు. బాల్య వివాహం జరుగుతున్న విషయం తెలుసుకున్న ఐసిడిఎస్ సిబ్బంది జిల్లా బాలల సంరక్షణ అధికారులకు సమాచారం అందించారు. సోమవారం ఉదయం జిల్లా బాలల సంరక్షణ అధికారి జామూరు, ఐసిడిఎస్ భీంగల్ ప్రాజెక్టు ఏసిడిపిఓ జ్ఞానేశ్వరి, మండల పర్యవేక్షకురాలు సరస్వతి, ఆర్ఐ, పోలీసులతో కలిసి గాంధీ నగర్‌లో అమ్మాయి ఇంటికి వెళ్లి బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. గ్రామ పెద్దల సమక్షంలో అమ్మాయి తల్లిదండ్రులకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి, బాల్య వివాహాన్ని నిలుపుదల చేయించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి జామూరు మాట్లాడుతూ అమ్మాయికి 18 సంవత్స రాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు వచ్చే వరకు వివాహం చేయొద్దని సూచించారు. అలా కాకుండా బాల్య వివాహం జరిపిస్తే బాల్య వివాహ నిరోధక చట్టం కింద శిక్షింపబడతారని స్పష్టం చేశారు. బాల్య వివాహానికి సహకరించిన, ప్రోత్సహించిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మైనర్ బాలిక జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నట్లు తెలిపారు. తక్షణమే అమ్మాయికి రీ అడ్మిషన్ ఇప్పించి కేజీబీవీ లో చేర్పిస్తున్నట్లు వివరించారు.



కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

కస్తూర్బా విద్యార్థులకు ఆయుష్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/మాక్లూర్

మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిట్లను ఎంపీపీ కుంచాల విమల రాజు సోమవారం అందజేశారు. పదవ తరగతి విద్యార్థులకు ఆయుష్మ న్యూట్రిషన్ కిట్లతోపాటు పోషకాహార రాగి లడ్డులను పంపిణీ చేసినట్లు మండల ఆయుర్వేద వైద్యాధికారి లలిత తెలిపారు. ఈ సందర్భంగా ఆయుర్వేద డాక్టర్ లలిత మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడి తగ్గించి శారీరక దృఢత్వానికి న్యూట్రిషన్ కిట్లు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. ఇతర తరగతి బాలికలకు పోషకాహార రాగి లడ్డులను అందజేశామన్నారు. ఇవి తరచుగా వాడటం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుదల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, సంపూర్ణ పోషకాలు లభించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. ఆయుష్మ వైద్య విధానాలపై బాలికలకు అవగాహన కల్పించామన్నారు.

కార్యక్రమంలో సర్పంచ్ జక్కం చంద్రకళ బాలకిషన్, మండల కో ఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్, కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వప్న, ఫార్మసిస్టులు వరలక్ష్మి, గౌతం రాజ్, మహేందర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాక్లూర్ : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆయుష్ హెల్త్ కిట్లను ఆయుష్ డిపార్మెంట్ అధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థినిలకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయుష్ అధికారి డా. మమత మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా బాలికలకు ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. వీటితో పాటు రాగి లడ్డు అందజేశారని అన్నారు. వీటిని విద్యార్థినిలు ప్రతి రోజూ ఉదయం, రాత్రి తీసుకోవడం వల్ల జ్ఞాపక శక్తి పెరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దగ్గల అనిత సాయిలు, పాఠశాల ప్రత్యేకాధికారి ప్రగతి, సిబ్బంది సవిత, బ్రిజారాణి, జోష్నకవిత, మీరాబాయి, కవిత, విద్యార్థినిలు పాల్గొన్నారు.



న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ

కంటి శిబిరం సక్సెస్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సక్సెస్ చేయ డం అభి నంద నీయంమని నడిపల్లి పంచాయతీ గ్రేడ్-వన్ కార్యదర్శి, ఇన్చార్జ్ ఎంపీవో నిట్టు కిషన్ రావు అన్నారు. సోమవారం డిచ్‌పల్లి బస్టాండ్ కు అనుకుని ఉన్న గ్రామపంచాయతీ కార్యాల యంలో కంటి శిబిరం ముగింపు కార్యక్రమం సందర్భంగా వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీలకు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఇందల్ వాయి ఆసుపత్రి వైద్యులు సంతోష్, వైద్యురాలు ఎస్ మానస, పిహెచ్ ఎన్ ఎలిజబెత్, కంటివైద్యులు సౌ మ్య స్వప్న, యుడిసి నీలాదేవి, ఐకేపీసిసి సురేష్, ఇందల్ వాయి ప్రభుత్వ ఆసు పత్రి హెచ్ఈఓ శంకర్, జునియర్ అసిస్టెంట్ రజాత్, బిల్ కలెక్టర్లు, కారోబార్, ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పలువురిని సన్మానిస్తున్న దృశ్యం

స్పోర్ట్స్ ఇంచార్జ్, ఫిజికల్ డైరెక్టర్లను సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ఇన్చార్జి, ఫిజికల్ డైరెక్టర్ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ శివ మాట్లాడుతూ యూనివర్సిటీలో స్పోర్ట్స్ బోర్డ్ ఏర్పడినప్పటికీ కావలసిన పరికరాలు లేవని, సరైన గ్రౌండ్ లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. యూనివర్సిటీ, అఫ్లియేటెడ్ కాలేజెస్ సౌత్ జోన్, ఆల్ ఇండియా నేషనల్ లెవెల్ గేమ్స్‌కు హాజరైన విద్యార్థులకు ఇచ్చే డబ్బులు అకౌంట్ సెక్షన్ నుంచి స్పోర్ట్స్ అకౌంట్లో వచ్చిన తర్వాత కూడా ఇవ్వకుండా తిప్పుకోవడం సరికాదన్నారు.. స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ అభివృద్ధి చెందకుండా అడ్డుపడుతున్న స్పోర్ట్స్ ఇన్చార్జ్, ఫిజికల్ డైరెక్టర్ల పై చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇందూరు విభాగ సోషల్ మీడియా కన్వీనర్ నవీన్, ఎస్ ఎఫ్ డి జిల్లా కన్వీనర్ ప్రమోద్, నాయకులు జయంత్ శ్రవణ్ మహేష్ ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

బామ్మర్ది దాడిలో బావకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-రామారెడ్డి

కుటుంబ కలహాలతో బామ్మర్ది దాడి చేయడంతో బావకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని ఉప్పల్‌వాయిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఉప్పల్వాయి గ్రామానికి చెందిన గిరిమై బాలయ్య- అంజమ్మల కూతురు మానసను 8 సంవత్సరాల క్రితం లింగాపూర్‌కు చెందిన మల్లు గాని సంగయ్య కు ఇచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు కూతుర్లు ఉండగా.. మానస ప్రస్తుతం గర్భిణి. గత కొంత కాలం నుండి భార్య భర్తలు తరచూ గొడవలు పడగా, పోలీసులు కౌన్సిలింగ్ కూడా ఇచ్చినట్లు తెలిసింది. సోమవారం ఉప్పల్వాయిలో కుల పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి, తిరిగి లింగాపూర్ వెళ్తున్నారు. బావమరిది గిరిమై నరేష్ కామారెడ్డిలో ఎలక్ట్రిషన్ పని చేస్తూ ఇంటికి తిరిగి వస్తుండగా, రంగంపేట శివారులో ఇద్దరు తారాసపడడంతో, మాట మాట పెరిగి నరేష్.. బావ సంగయ్య పై కట్టెతో, కటింగ్ ప్లేయర్‌తో దాడి చేయడంతో తలపై, శరీరంపై గాయాలు అయ్యాయి. సంగయ్య పెద్దమ్మ నరసవ్వకు గాయాలవడంతో హుటాహుటిన 108 అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంగయ్య తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. నరేష్ కుటుంబుకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

స్నేహితుని స్మారకార్థం.. బడిలో స్టేజీ, షెడ్డు ఏర్పాటు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన వారియర్ యూత్ పదవ తరగతి 2013-14 బ్యాచ్ విద్యార్థులు తోటి స్నేహితుడు సక్కారం నాగరాజు స్మారకార్థం స్టేజ్, షెడ్ ఏర్పాటు చేశారు. మృతి చెందిన తమ మిత్రుని పేరు పాఠశాలలో ఎప్పటికీ నిలిచి ఉండేలా ఏదైనా కార్యక్రమం చేపట్టాలన్న ఆశయంతో రూ.80 వేలతో ప్రస్తుతం ఉన్న స్టేజ్‌ను కొద్ది భాగం విస్తరించి దానిపై షెడ్ నిర్మించారు. ఎండ, వానలో కార్యక్రమాలు చేసుకోవడానికి వీలుగా స్టేజిని తీర్చిదిద్దారు. స్టేజి షెడ్డు ను సోమవారం సర్పంచ్ సక్కారం శేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు విద్యార్థులకు స్వీట్స్, అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తోట జ్యోతి మనోహర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బైకాని ముకేశ్, ఉప సర్పంచ్ కస్తూరి సర్పంచ్ విక్రమ్, గ్రామ అభివృద్ధి కమిటీ సదర్ మురళి, ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాస్, కృష్ణ పంతులు, నారాయణ, అనిల్, వారియార్ యూత్ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, ఉపాధ్యాయులు పాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాటు చేసిన స్టేజీ, షెడ్డును ప్రారంభిస్తున్న సర్పంచ్